సాక్షి
విజయనగరం

గురువారం । 8 । సెప్టెంబర్ । 2022

దీపారాధన



విజయనగరం అర్బన్: గణపతి నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా విజయనగరంలోని తోటపాలెం రామమందిరం ప్రాంగణంలో భక్తులు బుధవారం వినాయక ఆకృతి రూపంలో దీపాలు వెలిగించారు. గణనాథునికి ప్రత్యేక పూజలు జరిపారు.

క్షమించండి



'అమ్మా...నాన్నా.. క్షమించండి. మీ అంచనాలు, ఆశలు అందుకోలేకపోతున్నాను. పరీక్ష మెరుగ్గా రాయలేకపోతున్నాను. తమ్ముడిని బాగా చదివించండి' అంటూ సూసైడ్ నోట్ రాసి శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ) విద్యార్థిని భవిరి విశిష్ట రోషిణి (17) బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది.

- 8లో

ఏఎన్ఎంలకు కౌన్సెలింగ్

విజయనగరం ఫోర్ట్: వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో విధుల నిర్వహణకు రెగ్యులర్ ఏఎన్ఎంలకు బుధవారం స్థానిక జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్‌వీ రమణకుమారి వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, పనిచేయాల్సిన ప్రదేశాలను కేటాయించారు.

న్యూస్‌రీల్

రీ సర్వే వేగవంతం చేయాలి

- సీడీఎంఏ ప్రవీణ్‌కుమార్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కార్పొరేషన్ అధికారులు

విజయనగరం: వివిధ శాఖల సమన్వయంతో రీ సర్వేను వేగవంతం చేయాలని కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రవీణ్‌కుమార్ ప్రణాళిక అధికారులకు ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వివిధ అంశాలపై బుధవారం సమీక్షించారు. అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మధుసూదన్‌రావు, టీపీబీఓ ఫిలిప్, ప్రణాళిక కార్యదర్శులు పాల్గొన్న వీడియో కాన్ఫరెన్స్‌లో నగరంలో జరుగుతున్న రీ సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. రూరల్ సర్వే రికార్డు, టౌన్ సర్వే రికార్డుల ఆధారంగా సర్వేకు అవసరమైన సమగ్ర సమాచారాన్ని తెలుసుకొని రీసర్వేను వేగవంతం చేయాలన్నారు.

రామతీర్థం హుండీల ఆదాయం రూ.14.97 లక్షలు



రామతీర్థంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న శ్రీవారి సేవా భక్తులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థాన హుండీల ఆదాయాన్ని అధికారులు బుధవారం లెక్కించారు. దేవస్థానంలో మొత్తం 13 హుండీల ద్వారా 84 రోజులకు రూ.14,97,485ల ఆదాయం లభించిందని ఈఓ ప్రసాదరావు తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని విజయనగరం పైడితల్లి అమ్మవారి దేవస్థాన సహాయ కమిషనర్ బీహెచ్‌వీఎస్ కిశోర్‌కుమార్ పర్యవేక్షించారు. విశాఖ, విజయనగరం జిల్లాలకు చెందిన పలువురు శ్రీవారి భక్తులు, ట్రస్టు బోర్డు సభ్యులు బూర్లె సత్యం, దేవస్థానం సిబ్బంది హుండీల ఆదాయం లెక్కింపులో పాల్గొన్నారు.

విజ్జి ఇండోర్ స్టేడియం పరిశీలన



మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

విజయనగరం: నగరంలోని విజ్జి మైదానంలో ఉన్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను కేంద్ర బృందం బుధవారం పరిశీలించింది. మల్టీపర్పస్ స్టేడియం నిర్మాణం, దాని నాణ్యత, ఉపయోగాలను అధికారులను సెట్విజ్ సీఈఓ రామానందం, చీఫ్‌కోచ్ అప్పలనాయుడును అడిగి తెలుసుకున్నారు. కేంద్ర క్రీడల శాఖ మానిటరింగ్ కమిటీ సభ్యులు పి.చంచలాల్, సాయి అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ సతీష్ చంద్ర యాదవ్, చీఫ్ ఇంజినీర్ కనకరాజు, శాప్ టెక్నికల్ ఏడీ దేవానందం తదితరులు పాల్గొన్నారు.

రజతంతో మెరిసిన త్రివేణి



ఖేలో ఇండియా నేషనల్ విమెన్ జూడో లీగ్‌లో రజత పతకం సాధించిన త్రివేణి

బొబ్బిలి: ఖేలో ఇండియాలో భాగంగా కేరళలోని త్రిసూర్‌లో ఈనెల 1 నుంచి 5వ తేదీ మధ్య జరిగిన సౌత్‌జోన్ నేషనల్ ఉమెన్ జూడో లీగ్ పోటీల్లో రామభద్రపురం గ్రామానికి చెందిన బంటు త్రివేణి రజత పతకం సాధించినట్టు జూడో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొత్స రత్నకిషోర్ బుధవారం తెలిపారు. ఆరు రాష్ట్రాల మధ్య జరిగిన పోటీల్లో 78 కిలోల విభాగంలో త్రివేణి పతకం సాధించినట్టు వెల్లడించారు. బొబ్బిలి రాజా కాలేజ్‌లో చదువుతున్న క్రీడాకారిణి జిల్లాకు తొలిసారి జాతీయ పతకం తెచ్చిపెట్టిందన్నారు. ఆమెను అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రౌతు వాసుదేవరావు, అధ్యక్షుడు ఎం.రామారావు నాయుడు, వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు నల్ల వెంకటనాయుడు, కోచ్ నగిరేసునాయుడు, రాజా కళాశాల ప్రిన్సిపాల్ వీరేంద్ర కుమార్‌లు అభినందించారు.

అక్షర వెలుగులు

- చీకట్లను చీల్చి వెలుగునింపే తుణీరం.. అక్షరం
- అక్షరాస్యత పెంపే లక్ష్యంగా ప్రభుత్వం కృషి
- 'చిట్టి గురువులు' వంటి వినూత్న కార్యక్రమాలతో ముందుకు
- మూడేళ్లలో పెరిగిన జిల్లా అక్షరాస్యత శాతం
- అధికారిక గణాంకాల ప్రకారం 93.85 శాతం
- రానున్న గాంధీజయంతి నాటికి శతశాతం సాధనే లక్ష్యం
- నేడు ప్రపంచ అక్షరాస్యతా దినోత్సవం



జిల్లాలో అక్షర పూలు వికసిస్తున్నాయి. మాలలుగా మారి.. నిరక్షరాస్యుల జీవితాల్లో అక్షర సువాసనలు వెదజల్లుతున్నాయి. బతుకుబాటకు కొత్తదారి చూపిస్తున్నాయి. మారుతున్న పరిస్థితులను అర్థం చేసుకునే జ్ఞానాన్ని ప్రసాదిస్తున్నాయి. జిల్లాలో చేపట్టిన చిట్టిగురువులు కార్యక్రమం సత్ఫలితాలిస్తోంది. శతశాతం అక్షరాస్యత సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతోంది.



చెట్టు కింద అక్షరాలు నేర్పిస్తున్న గణేష్

సాక్షి ప్రతినిధి, విజయనగరం/రాజాం:

అజ్ఞానమనే తిమిరంపై సమరానికి అక్షరం ఒక ఆయుధం. కష్టాలనే చీకట్లను చీల్చి జీవితాల్లో వెలుగు నింపే తుణీరం. వ్యక్తిగత అభివృద్ధికి తద్వారా సమాజ ప్రగతికి ఆధారం. సమస్తం డిజిటల్ యుగమైన నేపథ్యంలో అక్షరజ్ఞానం అత్యవసరం. దీనిని దృష్టిలోపెట్టుకుని ప్రభుత్వం అక్షరాస్యత శాతం పెంపుపై దృష్టి పెట్టింది. ప్రధానంగా వయోజన విద్య సాధనంగా తీసుకుంది. 'చిట్టి గురువులు' వంటి వినూత్న కార్యక్రమంతో ఆ దిశగా ముందుకు వెళ్తోంది. గత మూడేళ్ల కాలంలో జిల్లా అక్షరాస్యత శాతంలో గణనీయంగా మార్పు వచ్చింది. అధికారిక గణాంకాల ప్రకారం 93.85 శాతం వరకూ ఉందని అంచనా. రానున్న గాంధీ జయంతి (అక్టోబర్ 2) నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధన లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అక్షరాస్యత ప్రాధాన్యాన్ని తెలియజేసేందుకు యునెస్కో ప్రతిపాదనతో తొలిసారి 1965వ సంవత్సరం సెప్టెంబర్ 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. నేడు ప్రపంచ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా జిల్లాలో పరిస్థితి ఏమిటో చూద్దామా!

ఇదీ పరిస్థితి..

విద్యానగరంగా పేరుగాంచిన 2011 జనాభా లెక్కల ప్రకారం ఉమ్మడి విజయనగరం జిల్లాలో 58.89 శాతం మాత్రమే అక్షరాస్యత ఉండేది. పురుషుల్లో అక్షరాస్యత 68.15 శాతం. మహిళా అక్షరాస్యత శాతం 49.87 మాత్రమే నమోదైంది. 2010-18 మధ్య కాలంలో సాక్షర భారత్ కార్యక్రమం ద్వారా 6.08 లక్షల మంది అక్షరాస్యులుగా మారారు. 2018 మార్చి 31 నాటికి అధికారిక గణాంకాల ప్రకారం 1,92,214 మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు తేలింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పఢ్నా-లిఖ్నా కార్యక్రమంతో వారిలో 22,758 మంది అక్షరాస్యులయ్యారు. జిల్లాల విభజన తర్వాత ప్రస్తుత గణాంకాల ప్రకారం విజయనగరం జిల్లాలో 15,65,627 మంది జనాభా ఉన్నారు. వారిలో 13,14,175 మంది అక్షరాస్యులు కావడం విశేషం. కేవలం 86,096 మంది మాత్రమే నిరక్షరాస్యులు ఉన్నారు. ఈ ప్రకారం జిల్లా అక్షరాస్యత శాతం 93.85గా ఉంది.

నా వంతు ప్రయత్నం చేస్తున్నా...

నేను డెంకాడ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు చిట్టిగురువుగా నన్ను ఎంపిక చేశారు. మా అమ్మ కొర్నాన బంగారమ్మతో పాటు ఎనిమిది మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే పని చేస్తున్నాను.



శత శాతమే లక్ష్యంగా...

రానున్న గాంధీ జయంతి నాటికి అందరికీ చదువు నేర్పించి సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో చిట్టిగురువులు కార్యక్రమాన్ని పునఃప్రారంభించారు. 7వ తరగతి నుంచి 9వ తరగతి వరకూ చదువుకుంటున్న విద్యార్థులే గురువులయ్యారు. 9,167 మంది చిట్టిగురువులుగా ఈ బృహత్తర కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు. అక్షరాస్యతలేని తల్లిదండ్రులైనా, బంధువులైనా ఉంటే కనీసం పది మందిని ఎంపిక చేసుకొని వారికి చదువు చెప్పడం వారి బాధ్యత. తద్వారా విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెంపొందించడమూ ఈ కార్యక్రమ లక్ష్యం. అధికార యంత్రాంగంతో పాటు గ్రామస్థాయిలో సర్పంచులు, ఎంపీటీసీల నుంచి జిల్లా స్థాయి ప్రజాప్రతినిధులూ భాగస్వాములయ్యారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులతో పాటు డీఆర్‌డీఏ, డ్వామా, ఐసీడీఎస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, జిల్లా పరిషత్ తదితర ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ శాఖల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా భాగస్వాములవుతున్నారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష శాఖల సహకారంతో జిల్లా వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ కోట్ల సుగుణాకరరావు పర్యవేక్షిస్తున్నారు.

చిట్టి గురువు 'గణేష్'....



విజయనగరం మండల పరిధిలోని కొండకరకాం గ్రామం యాతవీధికి చెందిన సిమ్మల గణేష్ స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. చిట్టి గురువుగా మారి తన తల్లిదండ్రులతో పాటు వీధిలోని నిరక్ష్యరాస్యులైన పది మంది వయోజనులకు చదువుపై ఆసక్తి కల్పిస్తున్నాడు. అతని కృషికి స్థానికులు అభినందనలు తెలుపుతున్నారు.



రాజాం మండలం ఒమ్మిలో వయోజనులకు పాఠాలు చెబుతున్న శిరీష

అక్షరాలు నేర్పించి అవార్డుకు ఎంపిక...

రాజాం మండలంలోని కంచరాం జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి విద్యార్థి వి.శిరీష ఉత్తమ చిట్టిగురువుగా ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం రోజున అవార్డు కూడా అందుకుంది. తమ స్వగ్రామం ఒమ్మిలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దింది. వారు ఇప్పుడు రాయడంతో పాటు చిన్నచిన్న పదాలు చదవడం కూడా నేర్చుకుంటున్నారు.

చిట్టి గురువుతో చిన్నచిన్న పదాలు....

మెంటాడ మండలంలోని జక్కువ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కె.జగదీష్ ఆరుగురు వయోజనులకు గురువుగా మారాడు. అతని కృషితో వారందరికీ రాయడం, చిన్న చిన్న పదాలను చదవడం కూడా వచ్చేసింది. తమ జీవితంలో చదువులేదని, ఎప్పటికీ రాదని భావించే తాము ఇప్పుడు ఆ లోటు తీరిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వయోజనులకు అక్షరాలను నేర్పుతున్న జగదీష్



పెద్దలతో అక్షరాలు దిద్దిస్తున్న ఆర్.రామచంద్రాపురం పాఠశాల విద్యార్థి శశాంక్

ఆనందంగా ఉంది...

లింగరాజపురం గ్రామంలో మా అమ్మానాన్నతో పాటు నిరక్షరాస్యులైన వారికి అక్షరాలు నేర్పిస్తున్నాను. తొమ్మిదో తరగతి చదువుతున్న నేను వారికి గురువుగా మారడం, గురు పూజోత్సవం రోజున జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎంపీ చేతుల మీదుగా సన్మానం పొందడం ఆనందంగా ఉందని శశాంక్ పేర్కొన్నాడు.

నలుగురికి అక్షరాలు నేర్పించింది...

బాడంగి మండల కేంద్రంలోని యాదవవీధిలో కొయ్యాన జ్యోతి 12 మంది వయోజనులకు అక్షరజ్ఞానం నేర్పుతుంది. వీరిలో ఇప్పటికే నలుగురు పేర్లు రాయడం, చదవడం నేర్చుకున్నారు. వారికి తానే పలకలు కొనిచ్చింది. బ్యాంకు ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నోట్ల లెక్కింపుతో పాటు నైతికవిలువల గురించి చెబుతోంది.



వయోజనులకు అక్షరాలు నేర్పిస్తున్న జ్యోతి

ఆశాజనక ఫలితాలు...

వయోజన విద్యా కార్యక్రమం జిల్లాలో మంచి ఫలితాలిస్తోంది. చిట్టి గురువుల కార్యక్రమం ద్వారా జిల్లాలో అక్షరాస్యతా శాతం గణనీయంగా పెరుగుతోంది. మరోవైపు ఓపెన్ స్కూల్ విధానం రావడంతో జిల్లాలో ఓపెన్ టెన్త్ చదువుతున్నవారి సంఖ్య పెరుగుతోంది.

– కోట్ల సుగుణాకరరావు, డిప్యూటీ డైరెక్టరు, వయోజన విద్యాశాఖ, విజయనగరం జిల్లా



శతశాతం ఈ-క్రాప్ నమోదే లక్ష్యం

- జేసీ మయూర్ అశోక్



ఆన్‌లైన్‌లో ఆదేశాలిస్తున్న జేసీ మయూర్‌అశోక్

విజయనగరం అర్బన్: జిల్లాలో శతశాతం ఈ-క్రాప్ నమోదు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని జేసీ మయూర్‌అశోక్ ఆదేశించారు. బొబ్బిలి రెవెన్యూ డివిజన్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో ఆన్‌లైన్‌లో బుధవారం సమీక్షించారు. నవరత్నాలు, ప్రభుత్వ భవనాల నిర్మాణం, ఈకేవైసీ, ఈ-క్రాప్, గడపగడపకు మన ప్రభుత్వం తదితర కార్యక్రమాల్లో ప్రగతిపై ఆరా తీశారు. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న వివిధ రకాల భూముల్లో వేసిన అన్నిరకాల పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. వేసిన ప్రతీ పంటా ఈ-క్రాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ ఆ లక్ష్యాన్ని నెరవేర్చాలని సూచించారు. జిల్లాలో సగటున 51 శాతం ఈ-క్రాప్ జరగ్గా, బొబ్బిలి డివిజన్లో మాత్రం 49 శాతం మాత్రమే జరగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పీఎం కిసాన్, ఈకేవైసీ రిజిస్ట్రేషన్లపై ఆరా తీశారు. ఎరువుల సరఫరాపై ప్రశ్నించారు. అన్ని రైతుభరోసా కేంద్రాల్లో సరిపడిన ఎరువుల నిల్వలను ఉంచాలని ఆదేశించారు. ఎరువుల షాపులను తనిఖీ చేయాలని, ప్రతీ షాపువద్ద వివరాలతో కూడిన ఫ్లెక్సీలు ఏర్పాటు తప్పనిసరి అని స్పష్టం చేశారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, డిజిటల్ లైబ్రరీల భవన నిర్మాణాలపై సమీక్షించారు. నిర్ణీత గడువులోగా నిర్మాణాలు పూర్తిచేయాలని ఆదేశించారు. వీటికి సంబంధించిన పెండింగ్ బిల్లులు వారం రోజుల్లో వచ్చే అవకాశం ఉందన్నారు. స్పందన ఫిర్యాదుల పరిష్కారంపై ఆరా తీశారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కరించాలన్నారు.

నైరేడ్ శిక్షణ భేష్

రాజాం: రాజాంలోని జీఎంఆర్ నైరేడ్ శిక్షణ సంస్థను సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ (సెర్ప్) స్టేట్ అడిషనల్ డైరెక్టర్ రెడ్డి విజయ్‌కుమార్ బుధవారం సందర్శించారు. సంస్థలో టైలరింగ్, రిఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండిషన్, హౌస్‌వైరింగ్ విభాగాల్లో శిక్షణపొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, నైపుణ్యాలు పెంపొందించుకుని సొంతంగా యూనిట్లు ఏర్పాటుచేసుకునేవారికి సెర్ప్ నుంచి రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు. అనంతరం నైరేడ్ సంస్థ అసోసియేటివ్ ప్రొగ్రాం మేనేజర్ సి.నాగరాజు, డైరెక్టర్ కె.శశిధర్‌లతో మాట్లాడారు. నైరేడ్ నిర్వహణ చక్కగా ఉందని కితాబిచ్చారు. కార్యక్రమంలో రాజాం ఏపీఎమ్ దధికుమార్, ఎమ్ఎమ్ఎస్ అధ్యక్షులు అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

వివరాలు సేకరిస్తున్న సెర్ప్ అడిషనల్ డైరెక్టర్



కాలుష్య రహిత నగరమే లక్ష్యం

- కలెక్టర్ ఏ.సూర్యకుమారి



వర్చువల్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్ర నగర పాలక సంస్థను కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికను రూపొందించి అమలు చేయనున్నట్టు కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం (నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం) కింద కాలుష్య రహిత నగరంగా విజయనగరాన్ని తీర్చిదిద్దేందుకు వివిధ శాఖల సమన్వయంతో కృషిచేయనున్నట్టు వెల్లడించారు. జిల్లా కేంద్రంలో వాయు కాలుష్యాన్ని తగ్గించి గాలి నాణ్యతను పెంపొందించే చర్యలపై చర్చించేందుకు ఏర్పాటైన జిల్లా స్థాయి కమిటీ సమావేశం బుధవారం వర్చ్యువల్‌గా సాగింది. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ వాయు నాణ్యతను మెరుగుపరచడంలో నగర పాలక సంస్థ, రవాణా, పోలీస్, కాలుష్య నియంత్రణ మండలి, వ్యవసాయ శాఖల భాగస్వామ్యం అవసరమన్నారు. రోడ్లను బీటీ రోడ్లుగా మార్పుచేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కాలుష్య రహిత వాహన వినియోగాన్ని పెంచాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి బీటీ రామారావు, జిల్లా రవాణ అధికారి ఆదినారాయణ, ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు, పరిశ్రమల శాఖ, జిల్లా అధికారి పాపారావు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



కుసుమూరులో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

- రూ.750 కోట్ల వ్యయంతో తాగునీటి కల్పన ప్రణాళిక
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

తెర్లాం: విజయనగరం జిల్లాలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.750 కోట్ల వ్యయంతో పనుల ప్రణాళిక రూపొందించామని, నిధులు త్వరలో మంజూరు కానున్నట్టు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. కుసుమూరు-జనార్దనవలస మధ్య వేగావతి నదిపై రూ.12.49 కోట్ల వ్యయంతో నిర్మించనున్న వంతెన పనులకు బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడుతో కలిసి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కుసుమూరులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జిల్లాలో నెలకొన్న తాగునీటి సమస్యను రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడులు సీఎం జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారన్నారు. ప్రభుత్వం కొద్దిరోజుల్లోనే నిధులు మంజూరు చేయనుందని తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, ప్రస్తుతం ప్రాధాన్యతా క్రమంలో జిల్లాలోని అన్ని రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులపై పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు గ్రామాల్లోని అన్ని వర్గాల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. విజన్ ఉన్న ముఖ్యమంత్రి హయాంలో తను ఎమ్మెల్యేగా పనిచేయడం తన అదృష్టమని చెప్పారు. నియోజవర్గంలో తాగునీరు, రహదారుల సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. బహిరంగ సభలో ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే హైమావతి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీ సూర్యనారాయణరాజు, నియోజకవర్గ, మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత



జామి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో 25క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు బుధవారం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన యిందుకూరి వెంకటరావు ఇంటివద్ద పీడీఎస్ రైస్ నిల్వలు ఉన్నాయని ఫిర్యాదు అందడంతో మంగళవారం రాత్రి జామి, ఎస్.కోట, కొత్తవలస, గజపతినగరం, భోగాపురం సీఎస్‌డీటీలు ఇందిర, మూర్తి, డి.వి.రవిశంకర్, మురళీకృష్ణ, శ్రీనువాసరావుల బృందం వెంకటరావు ఇంట్లో తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఇంట్లో నిల్వ ఉంచిన 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం గుర్తించి స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. దీనిపై 6ఎ కేసు నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



ఆశలు నెరవేర్చలేను క్షమించండి

ఒక్క క్షణం ఆలోచించి ఉంటే ఈ పాటికి ఆ అమ్మాయి నవ్వుతూ ఇంటిలో ఉండేది. ఒక్క రోజు గడిస్తే చక్కగా కుటుంబ సభ్యులతో పుట్టిన రోజు వేడుకలు చేసుకుని ఉండేది. కానీ ఆ విద్యార్థిని సంయమనం చూపలేకపోయింది. తెలివితేటలతో ప్రతిష్టాత్మక ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థిని తన మనసుకు మాత్రం కరెక్ట్ సమాధానం చెప్పుకోలేకపోయింది. ఒక్క పరీక్షతో జీవితం ఆగిపోదన్న నిజాన్ని అర్థం చేసుకోలేక బలవన్మరణానికి పాల్పడింది. ఆశలు పెట్టుకున్న అమ్మానాన్నలకు క్షమాపణలు చెబుతూ బలవంతంగా ఊపిరి ఆపుకుంది. శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో పీయూసీ రెండో ఏడాది చదువుతున్న భవిరి విశిష్ట రోషిణి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.



విశిష్ట రోషిణి మృత దేహం

- శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని బలవన్మరణం
- పరీక్ష సరిగా రాయలేకపోయానని మనస్తాపంతో ఆత్మహత్య
- నేడు ఆ విద్యార్థిని జన్మదినం
- గత ఏడు నెలల్లో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య



విద్యార్థిని ఉరితీసుకున్న గది

ఎచ్చెర్ల క్యాంపస్: 'అమ్మా..నాన్నా.. క్షమించండి. మీ అంచనాలు, ఆశలు అందుకోలేకపోతున్నా ను. పరీక్ష మెరుగ్గా రాయలేకపోతున్నాను. తమ్ముడిని బాగా చదివించండి' అంటూ సూసైట్ నోట్ రాసి శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ) ఎస్ఎంపురం క్యాంపస్ విద్యార్థిని భవిరి విశిష్ట రోషిణి (17) బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. విద్యార్థిని క్యాంపస్‌లో ప్రీ యూనివర్సిటీ కోర్సు (పీయూసీ) రెండో ఏడాది చదువుతోంది. ప్రస్తుతం రెండో ఏడాది చివరి సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్నాయి. బుధవారం చివరి పరీక్ష ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐటీ) ఎగ్జామ్ జరిగింది. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. అయితే ఈ విద్యార్థిని 11 గంటలకే పరీక్ష ముగించేసి వసతి గృహంలోని తన గదికి వచ్చేసింది. పరీక్ష సరిగా రాయలేకపోయాననే భావనతో సూసైట్ నోట్ రాసి బ్లాక్ 1లో ఉన్న తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయింది. మిగతా విద్యార్థులు పరీక్ష పూర్తి చేసుకు ని వచ్చే సరికి రోషిణి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వారు భయపడి కేర్ టేకర్ జి.జయలక్ష్మికి చెప్పగా.. ఆమె అధికారులకు సమాచారం ఇచ్చారు. సంఘటనకు చేరుకున్న పరిపాలన అధికారి రమేష్‌నాయుడు, అధ్యాపకులు విద్యార్థినిని కిందకు దించి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అయితే విద్యార్థిని మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంటనే విద్యార్థిని తల్లిదండ్రులతో పాటు ఎచ్చెర్ల పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ టి.సత్యనారాయణ విద్యార్థిని ఫోన్‌తో పాటు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. క్లూస్ టీమ్ వచ్చి సాక్ష్యాలు సేకరించింది. చదువు ఒత్తిడి కారణంగానే విద్యార్థిని క్షణికావేశంలో బలవన్మరణానికి పాల్పడి ఉంటుందని భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలివైన విద్యార్థిని..

రోషిణి చిన్నతనం నుంచి తెలివైన విద్యార్థిని. పీయూసీ మొదటి ఏడాది, రెండో ఏడాది మొదటి సెమిస్టర్‌లోనూ 9.3 క్రెడిట్స్ సాధించి మంచి స్థానంలో ఉంది. చివరి పరీక్షకు సైతం శ్రమించి చదివి సన్నద్ధమైంది. అనుకున్న రీతిలో పరీక్ష రాయలేకపోవడంతో అసంతృప్తికి లోనయ్యింది. కోవిడ్ నేపథ్యంలో 10వ తరగతి పాస్ అయినా ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. ప్రారంభంలో మొదటి కౌన్సెలింగ్‌లో నూజివీడు క్యాంపస్ ఎంచుకుంది. సాలూరు శ్రీకాకుళానికి దగ్గర కావటంతో రెండో కౌన్సెలింగ్‌లో శ్రీకాకుళం క్యాంపస్ ఎంచుకుంది. తల్లిదండ్రులు సైతం తరచూ వచ్చి కలుస్తుండేవారు.

నేడు బర్త్‌డే..

గురువారం రోషిణి పుట్టిన రోజు. సెమిస్టర్ పరీక్షలు బుధవారం ముగియటంతో విశ్రాంతి కోసం మూడు రోజులు ఇళ్లకు వెళ్లేందుకు అవకాశం ఇచ్చారు. ఈ నేపథ్యంలో కుటుంబంతో కలిసి గురువారం జన్మదినం జరుపుకోవాలనుకుంది. 18వ ఏటలోకి అడుగు పెట్టాల్సిన విద్యార్థిని ఏకంగా లోకాన్నే విడిచి వెళ్లిపోయింది.

ఇది రెండో ఘటన..

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో ఏడు నెలల వ్యవధిలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకోవడం ఆందోళనకు గురిచేస్తోంది. విజయనగరం జిల్లా నెల్లిమెర్లకు చెందిన పీయూసీ మొదటి సంవత్సరం విద్యార్థిని కొండపల్లి మనీషా అంజు ఫిబ్రవరి 16న ఆత్మహత్యకు పాల్పడింది. విద్యాసంస్థలో చేరిన కొన్ని రోజులకే ఇంటిపై బెంగ (హోం సిక్‌తో) విద్యార్థిని మృతి చెందగా, ప్రస్తుతం విశిష్ట రోషిణి చదువు ఒత్తిడి కారణంగా చనిపోయింది.

కన్నీరుమున్నీరు..



కుటుంబ సభ్యులతో విశిష్ట రోషిణి

విశిష్ట రోషిణిది మన్యం జిల్లా సాలూరు పట్టణం తట్టికోట వీధి. తండ్రి బ్యాంకులో బంగారు నగల నిర్ధారణ పనిచేస్తుంటారు. తల్లి సౌజన్య గృహిణి. వీరికి 8వ తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నాడు. కుమార్తె మృతి విషయం తెలియగానే తల్లిదండ్రులు శ్రీకాకుళం రిమ్స్‌కు చేరుకున్నారు. కుమార్తె మృత దేహాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యారు. ఇక క్యాంపస్‌లో విద్యార్థులు ఈ ఘటనతో హడలిపోతున్నారు. పరీక్షలు ముగియటం, మూడు రోజులు ఇళ్లకు వెళ్లే అవకాశం ఇవ్వటంతో తల్లిదండ్రులకు స మాచారం ఇచ్చి దగ్గరలో ఉన్న వారు ఇళ్లకు వెళుతున్నారు. మరోపక్క క్యాంపస్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా పోలీసు భద్రత ఏర్పాటు చేశారు.

ఉచిత నిర్బంధ విద్యాచట్టం అమలు చేయాలి

- డీఈఓ కె.వెంకటేశ్వరరావు

విజయనగరం పూల్‌బాగ్: ఉచిత నిర్బంధ విద్యా చట్టాన్ని అనుసరించి 2022–23 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో ప్రవేశాలు అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించినట్లు డీఈఓ కె.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాలకు చెందిన వారి (అనాథలు, దివ్యాంగులు, హెచ్ఐవీ బాధితుల పిల్లలు) కోసం 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం, బలహీన వర్గాలకు (బీసీ, మైనార్టీ, ఓసీ) చెందిన పిల్లలకు 6 శాతం సీట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో అర్హత కలిగిన పిల్లలకు 1 వ తరగతి విద్యార్థుల నమోదులో 25% సీట్లు కేటాయించి ఫీజు రీయింబర్స్‌మెంట్ పద్ధతిన 2022–23 విద్యా సంవత్సరానికి 1 వ తరగతిలో ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. అందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలకు వార్షిక ఆదాయం రూ.1,20,000గా, పట్టణ ప్రాంతంలో నివసించే బలహీన వర్గాల కుటుంబాల వార్షికాదాయం రూ. 1,40,000 ప్రాతిపదికగా తీసుకుని వారి కుటుంబా ల పిల్లలకు అర్హులుగా నిర్ణయించినట్లు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలలకు అర్హుల జాబితా

పాఠశాల విద్యాశాఖ సూచనలు, నిబంధనల ప్రకారం 1వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసి ఎంపికైన విద్యార్థుల జాబితాను సంబంధిత ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు పంపించామన్నారు. సంబంధిత తల్లిదండ్రులు/సంరక్షకులకు మొబైల్ ద్వారా సమాచారం చేరవేస్తామన్నారు. కావున జిల్లాలో గల అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వారి పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు సరైన రీతిలో సందేశాలు పంపించి ఈనెల 12వ తేదీ లోపు సంబంధిత పాఠశాలలో విద్యార్థుల ప్రవేశం జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎవరైనా ఆయా తేదీల్లో అడ్మిషన్ కాకపోతే, అడ్మిషన్ అర్హత కోల్పోతారన్నారు. అడ్మిషన్ సమయంలో పాఠశాల యాజమాన్యం విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించి అడ్మిషన్లు ధ్రువీకరించాలని పేర్కొన్నారు.

వెబ్‌సైట్‌లో ఎంపికైన వారి జాబితా

ప్రైవేట్, అన్ ఎడయిడెడ్ పాఠశాలల్లో 1వ తరగతిలో ప్రవేశం కోసం ఎంపికైన విద్యార్థుల జాబితా http://cre.ap.gov.in/DE వెబ్ పోర్టల్‌లో ఉంచినట్లు వివరించారు. ఉచిత నిర్బంధ విద్య అమలు ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే సదుపాయాలను (పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం) అన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అందజేయాలని స్పష్టం చేశారు.

40 మద్యం సీసాలతో ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో ఎస్ఈబీ సిబ్బంది

బొబ్బిలి: బొబ్బిలి ఎస్ఈబీ సర్కిల్ పరిధిలోని బలిజిపేట మండలం గంగాడలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం తరలించి నట్టు ఎస్ఈబీ సీఐ ఆర్‌జైభీమ్ తెలిపారు. గంగాడలో మద్యం విక్రయిస్తున్న సత్య వరపు శ్రీనివాసరావు, రాధాకృష్ణ అనే ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎస్సై చిన్నంనాయుడు, సిబ్బంది చంద్రప్రసాద్, ఆదినారాయణ, జయరాం, సరస్వతి తదితరులు దాడుల్లో పాల్గొన్నట్లు సీఐ చెప్పారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

వివిధకేసుల్లో పట్టుబడిన ఆరు ద్విచక్ర వాహనాలను గురువారం వేలం వేయనున్న ట్లు ఎస్ఈబీ సీఐ ఆర్ జై భీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎస్ఈబీ కార్యాలయం ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహించే వేలం ప్రక్రియలో ఔత్సాహికులు పాల్గొని వాహనాలను సొంతం చేసుకోవచ్చని సూచించారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	50,890–00
బంగారం(22సి. 10గ్రా.)	46,650–00
వెండి (కిలో)	58,200–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹132	₹234	₹ 244

పశువుల పాక దగ్ధం



వేపాడ: కాలిపోయిన ఆవులు, పెయ్యలను పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణంరాజు తదితరులు

వేపాడ: మండలంలోని భర్తవానిపాలెం గ్రామానికి చెందిన పోతల సన్యాసమ్మ పశువులపాక మంగళవారం అర్ధరాత్రి దగ్ధమైంది. దీనిపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ అగ్నిప్రమాదంలో పశువుల పాక పూర్తిగా కాలిపోగా నాటుబండి, రెండు ఆవులు, రెండు పెయ్యలు 10 నాటుకోళ్లు మృతి చెందాయి. మరో రెండు ఆవులు గాయాలపాలై విషమ పరిస్థితిలో ఉన్నాయి. సుమారు రూ.మూడు లక్షల ఆస్తినష్టం జరిగి ఉంటుందని అంచనా వేస్తున్నారు. ప్రమాదం ఎలా జరిగిందో తెలియరాలేదు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ కృష్ణంరాజు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు, ఆస్తినష్టంపై ఆరాతీశారు. నష్టం నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే లలిత కుమారి సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని ఓదార్చి రూ. పది వేలు ఆర్థిక సహాయం చేశారు. అలాగే పాల సంఘం తరపున మరో రూ.పదివేలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గొటివాడ దేవి, పాలసంఘ అధ్యక్షుడు పోతల రమణ, విశాఖ డెయిరీ మేనేజర్ బి.శివాజీ, సూపర్‌వైజర్ సింహాచలంనాయుడు, గొంప వెంకటరావు, వి.జగ్గుబాబు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి తిమ్మయ్యపేట గ్రామం వద్ద బుధవారం ద్విచక్రవాహనం ఢీకొని బొద్దాం గ్రామానికి చెందిన ముద్దన అప్పలనర్సమ్మ గాయపడింది. తన సోదరుడు దాసరి సన్యాసిరావు ద్విచక్రవాహనంపై అప్పలనర్సమ్మ రాజాం వస్తోంది. వెనుక నుంచి వేగంగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఆమె కిందపడి గాయాలపాలైంది. స్థానికులు వెంటనే స్పందించి రాజాం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి ర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వీబీ రామకృష్ణ తెలిపారు.

వ్యాయామంతో నొప్పులు పరార్..!

- పెరుగుతున్న వెన్నుపూస, నరాలు, మెడనొప్పుల బాధితులు
- సీతంపేట ఏరియా ఆస్పత్రిలో అందుబాటులో ఫిజియోథెరఫీ సేవలు
- నాలుగేళ్లలో 8 వేల మందికి పైగా బాధితులకు చికిత్స
- నేడు ప్రపంచ ఫిజియోథెరఫీ డే



ఏరియా ఆస్పత్రిలో ఫిజియో థెరఫీ కేంద్రం



ఫిజియో థెరఫీ చేసుకుంటున్న మధుసూదన్



యాక్సిడెంట్ బాధితుడికి ఫిజియోథెరఫీ చేస్తున్న ఫిజియో థెరపిస్ట్ నిరోష

సీతంపేట: మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన కొండగొర్రి మధుసూదన్. కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. నడవలేని పరిస్థితి. దీంతో స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఫిజియో థెరఫీ కేంద్రానికి వచ్చి ప్రతిరోజూ ఫిజియోథెరఫీ వైద్యం పొందుతూ కోలుకున్నాడు. అలాగే రాజన్నగూడకు చెందిన సవర బంబడుదీ అదే పరిస్థితి. వారిద్దరికీ మజిల్‌స్టిమ్యులేషన్ చేయడంతో మంచంపై నుంచి లేచి తిరుగుతున్నారు. ఇలా చాలా మంది ఏరియా ఆస్పత్రిలో ఫిజియో థెరఫీ సేవలు పొందుతున్నారు.ఆధునిక జీవన విధానంలో పెను మార్పులు సంభవించాయి. పనిఒత్తిడి, అధిక ప్రయాణం, ఇతర ఎన్నో కారణాలతో అన్ని వయస్సుల వారు నరాలు, వెన్ను, మెడ నొప్పులు, మూతి వంకర్లు, పక్షవాతం కండరాలు పట్టేయడం వంటి పలు రుగ్మతలతో సతమతమవుతున్నారు. ఒకప్పుడు వయసు మళ్లిన వారు, వృద్ధులు ఎక్కువగా ఇటువంటి సమస్యలతో బాధపడేవారు. ఇప్పుడు అన్ని వయస్సుల వారికి శరీరభాగాల్లో ఎక్కడో ఒక దగ్గర నొప్పులు వస్తూనే ఉన్నాయి. మందులతో నయం కాని నొప్పులకు విద్యుత్ పరికరాలతో కండరాలు, కీళ్లు, నరాల సామర్థ్యం పెంచేందుకు నిర్దిష్టమైన వ్యాయామం అందజేస్తూ ఫిజియో థెరపిస్టులు స్వాంతన చేకూరుస్తున్నారు. సీతంపేట ఐటీడీఏ పరిధిలో గల వివిధ మండలాల ప్రజల కోసం సీతంపేట ఏరియా ఆస్పత్రిలో ఫిజియో థెరఫీ సెంటర్‌ను నాలుగేళ్ల కిందట ప్రారంభించారు. నాలుగేళ్లుగా ఇప్పటి వరకు దాదాపు 8 వేల మందికి ఫిజియో థెరఫీ సేవలు ఇక్కడి ఆస్పత్రిలో అందించారు. ప్రతిరోజూ 10 నుంచి 20 మధ్య ఓపీ వస్తుంది. సోమవారం వారపుసంత రోజున 30కి పైగా ఓపీ ఉంటుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో సీతంపేట, భామిని, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, వీరఘట్టం మండలాలతో పాటు శ్రీకాకుళం జిల్లా పరిధిలోని కొత్తూరు, హిరమండలం, మెళియాపుట్టి తదితర మండలాల నుంచి ఇక్కడికి వచ్చి ఫిజియోథెరఫీ చేయించుకుంటున్నారు. పెరాలసిస్ రోగులకు ఇంటర్‌ఫెరన్షియల్ థెరఫీ, మజిల్ నెర్వ్ స్టిమ్యులేటెడ్ అల్ట్రా సౌండ్ వంటి పరికరాలు అందుబాటులో ఉన్నాయి. మెదడునుంచి నరాల కండరాలకు సంకేతాలు పంపించేందుకు నడిచే క్రమంలో మోకాలు, తుంటి కీళ్లలో పటుత్వం కోల్పోవడాన్ని నివారించేందుకు జాయింట్ నొప్పులు సరిచేసేందుకు అవసరమైన పలు రకాల వ్యాయమ సేవలను ఇక్కడ అందిస్తున్నారు.

వ్యాయామం తప్పనిసరి:



సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ వ్యాయామాన్ని జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలి. పనిచేసే చోట సరైన రీతిలో కూర్చుని ఉండకపోవడం, కంప్యూటర్ రంగం, మోటార్ బైక్‌లపై అధికంగా ప్రయాణించే వారు వెన్ను, మెడ, నరాల నొప్పులతో బాధపడుతున్నారు. ప్రజల్లో మరింత అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

బిడ్డిక నిరోషా, ఫిజియోథెరపిస్ట్, సీతంపేట

సద్వినియోగం చేసుకోవాలి



రోగులు మైదాన ప్రాంతాలకు వెళ్లి ఫిజియో థెరపీ చేయించుకోవాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. దీని దృష్ట్యా ఈ కేంద్రాన్ని సీతంపేట ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అవసరమైన ఎక్విప్‌మెంట్ కూడా ఉంది. పూర్తిస్థాయిలో సేవలు అందుతాయి. గిరిజన మండలాల్లో ఉన్న వారు వినియోగించుకోవాలి.

విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

క్లుప్తంగా

క్రీడల్లో కస్పా విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన కస్పా ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు

విజయనగరం: నగరంలోని కస్పా పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. పాఠశాలకు చెందిన ఎస్.వెంకటేష్ ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ట్రయాథ్లిన్ పోటీల్లో బంగారు పతకం సాధించి, గుంటూరులో ఈ నెల 9 నుంచి 11 వరకు జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అలాగే ఇదే పాఠశాలకు చెందిన కె.అనిల్‌కుమార్ మిడ్ రిలే, పెంటాథ్లిన్ అంశాల్లో రెండు కాంస్య పతకాలు సాధించాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.శంకరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు గోపాల్, శిక్షకుడు సతీష్ అభినందించారు.

ఈ క్రాప్ తప్పనిసరి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రామానందం

నెల్లిమర్ల: రైతులు పండించిన అన్ని పంటల వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేయించాల్సిన బాధ్యత వీఆర్‌ఓలు, వ్యవసాయ సహాయకులపై ఉందని మండల ప్రత్యేకాధికారి బి. రామానందం అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో ఈ క్రాప్, పీఎం కిసాన్ ఈకేవైసీపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలు ఈ క్రాప్‌లో నమోదు చేయకపోతే ధాన్యం కొనుగోళ్లు, పంటల బీమా, సున్నా వడ్డీ, పంట నష్టపరిహారం, రైతుభరోసా, తదితర ప్రయోజనాలు అందవన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎం. పూర్ణిమ, ఏఈఓ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అవార్డుగ్రహీతలకు సత్కారం



హెచ్‌ఎంను సత్కరిస్తున్న పెద్దలు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ రాధాకృష్ణ, స్కూల్ అసిస్టెంట్ టి. రాజేష్‌ను విద్యార్థులు, తల్లిదండ్రులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇరువురు ఉపాధ్యాయులు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. ఈ మేరకు స్థానిక పెద్దలు సముద్రపు రామారావు, నల్లి శ్రీనివాసరావు, తుమ్మ నారాయణమూర్తి, కనకల హైమావతి, మద్దిల గౌరి, కాళ్ల విజయ్‌కుమార్, తదితరుల ఆధ్వర్యంలో సత్కార సభ నిర్వహించారు.

జేసీ స్కాన్‌లో క్యాన్సర్ స్క్రీనింగ్ క్లినిక్



క్యాన్సర్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ వీఎస్ ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: నగరంలోని జేసీ స్కానింగ్ సెంటర్‌లో అపోలో క్యాన్సర్ స్క్రీనింగ్ సెంటర్‌ను డాక్టర్ వీఎస్ ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. అంకాలజిస్ట్ ప్రవీణ్‌కుమార్ క్యాన్సర్ రోగులకు సేవలు అందిస్తారని జేసీ స్కాన్స్ ఎం.డి ముద్రు జయచంద్ర నాయుడు తెలిపారు.

10న జాబ్‌మేళా

విజయనగరం అర్బన్: పట్టణంలోని బాలాజీ నగర్‌లో గల శ్రీనివాస డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్ ప్రాంగణంలో ఈ నెల 10వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ యు.సీతారామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైజర్ హెల్త్ కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో ఖాళీలను భర్తీ చేస్తామని పేర్కొన్నారు. తొలి ప్రయత్నంలో 50 శాతంతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై 18 నుంచి 20 సంవత్సరాల వయసుగల మహిళలు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థినులు 10వ తరగతి, ఇంటర్మీడియట్ ఒరిజినల్స్, జిరాక్స్‌లు మూడు సెట్లు, మూడు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకొని నేరుగా కళాశాల ప్రాంగణానికి హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 89191 82007 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

ఎండీఎం నిర్వాహకుల తొలగింపు

నెల్లిమర్ల: మండలంలోని సతివాడ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని నిర్వహిస్తున్న ఏజెన్సీ ప్రతినిధులను ఆ పథకం మండల కమిటీ బుధవారం తొలగించింది. కలెక్టర్ సూర్యకుమారి ఆదేశాల మేరకు పథకం నిర్వహణలో లోపాలపై ఎంఈఓ తాజాగా విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. ఆ విచారణలో నిర్వహణ లోపాలున్నట్లు రుజువు కావడంతో మండల కమిటీ తీర్మానం మేరకు నలుగురు నిర్వాహకులను తొలగించినట్లు ఎంఈఓ అంబళ్ల కృష్ణారావు తెలిపారు.

జనరంజక పాలనకు జేజేలు

- ఇంటింటికీ సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



తిప్పలవలసలో లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనకు ప్రజలు జేజేలు పలుకుతున్నారని నెల్లిమర్ల శాసనసభ్యుడు బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని తీరప్రాంతమైన తిప్పలవలసలో రెండోరోజు బుధవారం కూడా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు ఎమ్మెల్యే, తదితరులకు ఘన స్వాగతం పలుకుతూ ఇంటింటికీ తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మూడేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాల వల్ల ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందీ వివరించారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ, పేదల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విప్లవాత్మక పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే మంత్రంగా వచ్చే సార్వత్రిక ఎన్నికలలో ప్రజల్లోకి వెళ్లి ఆశీస్సులు తీసుకుంటామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలలో 96 శాతం వరకు అమలు చేసినట్లు తెలిపారు. కులం, మతం, రాజకీయాలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్ధనరావు, బర్రి చినఅప్పన్న, వాసుపల్లి అప్పన్న, వాసుపల్లి దానయ్యమ్మ, వాసుపల్లి దుర్గమ్మ, దారపు అప్పలసూరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలన వల్లే ఇబ్బందులు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుకు సమస్యలు వివరిస్తున్న సభ్యులు

పూసపాటిరేగ: గత టీడీపీ నాయకులు చేసిన అస్తవ్యస్త పాలన వల్లే ప్రజలు తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలకు దూరమయ్యారని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మహంతి కల్యాణి అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు. ముందుగా గ్రామాలలో వైద్యారోగ్యశాఖ అందిస్తున్న సేవలపై వైద్యాధికారులు రాజేష్‌వర్మ, త్రివేణి, త్రినాథ్ వివరించారు. పూసపాటిరేగ మండలానికి సంబంధించి సదరం కేంద్రం ఏర్పాటు చేయాలని వెంపడాం సర్పంచ్ పిన్నింటి కుమార్ అధికారులను కోరారు. గోవిందపురం రైతుభరోసా కేంద్రంలో ఎరువులు సఫరా చేయడం లేదని లంకలపల్లిపాలెం సొసైటీ అధ్యక్షుడు పసులేటి మహేష్ సభ దృష్టికి తీసుకువచ్చారు. మండల పరిధిలో 10,513 రైతులకు ఏడాదికి గాను రూ.13 కోట్ల వరకు రైతుభరోసా మంజూరైందని వ్యవసాయాధికారి కె. నీలిమ తెలిపారు. వర్షాభావ పరిస్థితులను బట్టి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించడానికి ప్రతిపాదనలు తయారుచేయాలని సర్పంచ్ పి. కుమార్ తెలిపారు. అలాగే లంకలపల్లిపాలెం ఎస్టీ కాలనీలో తాగునీటి బోరు వేయాలని సర్పంచ్ లంకలపల్లి వెంకటరత్నం కోరగా.. వెంటనే ఎమ్మెల్యే స్పందించి బోరు మంజూరు చేయాలని ఆదేశించారు. జల్ జీవన్ మిషన్‌లో మండలానికి 20 కోట్ల రూపాయలు మంజూరయ్యాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌శంకర్ తెలిపారు. రెల్లివలసలో సర్పంచ్‌కు తెలియకుండా పనులు చేస్తున్నారని, ప్రొటోకాల్ పాటించడం లేదని సభలో సర్పంచ్ ఇజ్జిరోతు అప్పలరాజు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిని ఎమ్మెల్యే అప్పలనాయుడు స్పందిస్తూ అధికారులను సమన్వయం చేసుకుంటే వెళ్తే ప్రభుత్వ కార్యక్రమాలపై సమాచారం ఇస్తారన్నారు. అలాగే రైతుభరోసా కేంద్రం, సచివాలయం పనులు పూర్తి చేయలేదని... గ్రామానికి మంజూరైన పనులపై సమాచారం ఇవ్వడం లేదని సర్పంచ్ తెలిపారు. దీనికి పతివాడ ఎంపీటీసీ సభ్యుడు పతివాడ అప్పలనాయుడు స్పందిస్తూ, ప్రత్యేక అధికారి పాలనలో పనులు మంజూరైనప్పుడు మీరు సర్పంచ్‌గా ఎన్నిక కాలేదు కదా అని ప్రశ్నించారు. ఇదే సమయంలో టీడీపీ ప్రభుత్వ పాలనలో ఎంతో మందిని ఇబ్బంది పెట్టిన సంగతి మీకు తెలియదా అని పేరాపురం ఎంపీటీసీ సభ్యుడు తమ్మునాయుడును పతివాడ ఎంపీటీసీ సభ్యులు పతివాడ అప్పలనాయుడు, పతివాడ శ్రీనులు ప్రశ్నించగా.. కొద్దిసేపు ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు మహంతి సీతాలక్ష్మి, ఎంపీడీఓ జి.రామారావు, తహసీల్దార్ ఇ.భాస్కరరావు, వైస్ ఎంపీపీలు సత్యనారాయణరాజు, అల్లాడ రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాల్సిందే..



మాట్లాడుతున్న ట్రాఫిక్ డీఎస్పీ మోహనరావు

విజయనగరం క్రైమ్: ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహన్‌రావు అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విద్యార్థులకు రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బస్సుల్లో ప్రయాణించే సమయాల్లో ఫుట్‌బోర్డుల వద్ద నిలబడవద్దని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయాల్లో సెల్‌ఫోన్లు వినియోగించవద్దని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. చాలా రోడ్డు ప్రమాదాలు వాహనదారుల నిర్లక్ష్యం, మద్యం మత్తులో జరుగుతున్నాయని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. బస్సులు వేగంగా వెళ్లే సమయాల్లో దిగడం, ఎక్కడం చేయరాదని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఎస్‌ఎం రఘునాథ్, డీపీటీఓ శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఎస్సై హరిబాబునాయుడు, ఏఎస్సై నాగ ఆదిత్య, ఆర్టీసీ సెక్యూరిటీ ఎస్సై ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం చర్యలతో సంతృప్తి

విజయనగరం ఫోర్ట్: నష్టాల ఊబిలో ఉన్న విద్యుత్ సంస్థను బయటపడేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన చర్యలతో ఉద్యోగులు సంతృప్తి చెందుతున్నారని వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు బీకేవీ ప్రసాదరావు అన్నారు. వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘంలో జూనియర్ ఎకౌంట్స్ ఆఫీసర్ మీనాకుమారి బుధవారం చేరారు. ఈ మేరకు ఆమెకు సభ్యత్వ పత్రం అందజేశారు.

విచ్చలవిడిగా గుట్కా విక్రయాలు

నెల్లిమర్ల రూరల్: నిషేధిత గుట్కాలను మండలంలో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన ఓ వ్యాపారి గుట్బుచప్పుడు కాకుండా గ్రామాల్లోని కిరాణా దుకాణాలకు గుట్కాలను సరఫరా చేస్తున్నారు. సదరు వ్యాపారి ఒడిశా నుంచి గుట్కాను భారీ స్థాయిలో దిగుమతి చేస్తూ ఇంట్లోనే నిల్వ చేసుకుని, దుకాణాలకు తరలిస్తున్నాడు. ఈ వ్యవహారం అంతా పట్టపగలే జరుగుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్న దాఖాలాలు కనిపించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కల్పించుకొని చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కేపీ ఈశ్వర్ సేవలు చిరస్మరణీయం



కేపీ ఈశ్వర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు

విజయనగరం టౌన్: వివిధ సేవా సంస్థల ద్వారా రిటైర్డ్ డీఎస్పీ కేపీ ఈశ్వర్ సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా బ్రహ్మణ సేవా సంఘాల సమాఖ్య అధ్యక్షుడు, న్యాయవాది టీవీ శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని కూరెళ్లవారి వీధిలో దివంగత కేపీ ఈశ్వర్ సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈశ్వర్ పోలీస్ శాఖలో నిజాయితీతో కూడిన సేవలందించారన్నారు. జిల్లా వయోశ్రేష్ఠుల సంఘ అధ్యక్ష్యుడిగా, బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడిగా, ప్రేమసమాజం సభ్యుడిగా ఎన్నో సంస్థల ద్వారా సేవలందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన స్ఫూర్తితో ఏడాదికాలంలో సమాఖ్య ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి గన్నవరపు శ్రీనివాస్, ప్రతినిధులు ద్వాదశి వేణు, కూరెళ్ల సరోజిని, కట్టమూరి చంద్రశేఖర్, దవళ సర్వేశ్వరరావు, దేవరాజు గోపాలకృష్ణ, మురళి, భమిడిపాటి రామ్ కుమార్ , సత్యనారాయణ, కూరెళ్ల శ్రీనివాస్, రమణమూర్తి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర రీసర్వేతో భూ సమస్యలకు చెక్

- సర్వే శాఖ ఎ.డి త్రివిక్రమరావు



రోళ్లవాకలో డ్రోన్‌తో భూసర్వేను ప్రారంభిస్తున్న ఎ.డి త్రివిక్రమరావు

బొండపల్లి: సమగ్ర భూరీసర్వేతో భూసమస్యలకు చెక్ పడనుందని, జిల్లా వ్యాప్తంగా సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని సర్వేశాఖ జిల్లా ఏడీ టి.త్రివిక్రమరావు తెలిపారు. మండలం లో ని రోళ్లవాక గ్రామంలో డ్రోన్ పరికరంతో భూరీసర్వేను బుధవారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ శతశాతం భూసమస్యలు పరిష్కారం కోసమే ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు– భూరక్ష పథకం పేరిట సమగ్ర భూసర్వే నిర్వహిస్తోందన్నారు. గ్రామాల్లో ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని భూసమస్యలకు ఈ సర్వేతో పరిష్కారం లభిస్తుందని, రైతులంతా సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శంకరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల గోపాలరావు, తాళ్లపూడి అప్పలనాయుడు, సుంకరి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ. 25 లక్షలతో రాజీవ్‌గాంధీ జంక్షన్ అభివృద్ధి



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

- విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగర సుందరీకరణలో భాగంగా ఎత్తు బ్రిడ్జి వద్ద గల రాజీవ్‌గాంధీ జంక్షన్‌ను రూ. 25 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. ఈ మేరకు జరుగుతున్న పనులను బుధవారం పరిశీలించారు. అలాగే మన విజయనగరం లోగో వద్ద వాటర్ ఫౌంటెన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజీవ్‌గాంధీ జంక్షన్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను ఈ నెల 9న మంత్రి బొత్స సత్యనారాయణ చేతులమీదుగా ప్రారంభిస్తామన్నారు. నగరం కార్పొరేషన్ స్థాయికి ఎదిగిన తరుణంలో అదే స్థాయిలో అభివృద్ధి చేపడుతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద వాటర్ ఫౌంటెన్, ఫిష్ అక్వేరియం, విద్యుత్ దీపాల అలంకరణ వంటి ఏర్పాట్లు చేపట్టామన్నారు. అలాగే నగరంలోని గోకుల్ పార్క్, కొత్తపేట, రైతుబజార్ జంక్షన్లతో పాటు గురజాడ అప్పారావు సర్కిల్, తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు తెలిపారు. నగరం పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు కూడా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్‌లు డాక్టర్ వీఎస్ ప్రసాద్, రెడ్డి గురుమూర్తి, దూబే, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు జీవీ రంగారావు, ధనలక్ష్మి, వింత ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేషన్ డీఈ అప్పారావు, ఏఈ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రూ. 26 వేల వేతనం చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీవీ రమణ

నెల్లిమర్ల: నగర పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు 26 వేల రూపాయల వేతనాన్ని చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీవీ రమణ, కార్యదర్శి ఎ.జగన్‌మోహన్‌రావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ, సమాన పనికి సమాన వేతనం ప్రాతిపదికన పారిశుధ్య కార్మికులకు 26 వేల రూపాయల వేతనంతో పాటు హెల్త్ అలవెన్స్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే ఈనెల 14న నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అలాగే ఈ నెల 20న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ఆందోళనలో పారిశుధ్య కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బాబూరావు, సురేష్, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలు నిండితే అదనపు పౌష్టికాహారం



పిల్లలకు అన్నప్రాసన చేస్తున్న సూపర్‌వైజర్ అనురాధ

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ

విజయనగరం ఫోర్ట్: పిల్లలకు ఆరు నెలలు నిండితే అదనపు పౌష్టికాహారాన్ని ద్రవరూపంలో గాని గుజ్జు రూపంలో గాని ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.అనురాధ తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక బోయ, రౌతువీధుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాలమృతాన్ని ద్రవరూపంలో చేసి పిల్లలకు అందివ్వాలన్నారు. క్యారెట్, బంగాళాదుంప ఉడికించి గుజ్జులా చేసి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కార్యకర్తలు రమణమ్మ, పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనాలు ప్రారంభం నేడు

నెల్లిమర్ల / నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ, జోగిరాజుపేట, బొప్పడాం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలను గురువారం ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ గిరబాల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ. 45 లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమాలకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, తదితరులు హాజరవుతారన్నారు. అనంతరం జోగిరాజుపేటలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

కాలుష్యరహిత వాతావరణానికి కృషిచేద్దాం..



విజయనగరం ఫోర్ట్: మొక్క నాటుతున్న సీతారామరాజు



విజయనగరం రూరల్: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



విజయనగరం ఫోర్ట్: మొక్క నాటుతున్న డాక్టర్ రవికుమార్

విజయనగరం రూరల్: చెట్లను కాపాడి కాలుష్య రహిత వాతావరణానికి అందరం కృషి చేద్దామని రాకోడు పీహెచ్‌సీ వైద్యాధికారి మోపాడ జగదీష్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ స్వచ్ఛ వాతావరణ దినోత్సవ సందర్భంగా రాకోడు పీహెచ్‌సీ వద్ద స్వచ్ఛ వాతావరణంపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వచ్ఛ వాతావరణ పరిస్థితులు నెలకొనడానికి, భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా జీవించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. అలాగే ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని మానుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రావణి, సీహెచ్‌ఓ మాణిక్యం, ఎంపీహెచ్ ఈఓ వీవీఆర్‌ఎం రాజు, పీహెచ్‌ఎన్ రాముడమ్మ, ఆరోగ్య పర్యవేక్షకులు శ్రీరామమూర్తి, శ్రీనివాసరావు, కళావతి, జయ, సత్యవతి, ఆరోగ్య సహాకులు చిన్నారావు, కృష్ణ, స్టాఫ్‌నర్స్ హేమావతి, ల్యాబ్ టెక్నీషియన్ అప్పలనాయుడు, ఏఎస్‌ఎం, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ బాధ్యత మనందరిది

విజయనగరం ఫోర్ట్: పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిదని కేంద్రాస్పత్రి సూపరింటెండెంట్ కె. సీతారామరాజు తెలిపారు. బుధవారం స్థానిక కేంద్రాస్పత్రిలో అంతర్జాతీయ స్వచ్ఛ వాతావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యానికి అనుగుణంగా మొక్కలను అధికంగా నాటాలని తెలిపారు. భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించడానికి ప్రతిఒక్కరూ పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ భారతి, ఎన్‌సీడీ వైద్యుడు మురళీకృష్ణ, డాక్టర్ బి. సత్యశ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ ఉత్పత్తులను నిషేధించాలి

విజయనగరం ఫోర్ట్: ప్లాస్టిక్, పాలిథిన్ సంచుల వాడకాన్ని నిషేధించాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి.రవికుమార్ అన్నారు. అంతర్జాతీయ స్వచ్ఛ వాతావరణ దినోత్సవం సందర్భంగా వైద్యారోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.